manachourasta


# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 172 | బుధవారం | 04.12.2024

## ఫ్లాష్ ఫ్లాష్



# వణికించిన భూకంపం

### తెలుగు రాష్ట్రాల్లో భూప్రకంపనలు

- జనగామలో 3 నుంచి 5 సెకండ్ల పాటు కంపించిన భూమి
- భయాందోళన చెందిన జనం

తెలుగు రాష్ట్రాల్లో బుధవారం ఉదయం పలు చోట్ల స్వల్ప భూప్రకంపనలు వచ్చాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, చర్ల, చింతకాని, నాగులవంచ మండలాల్లో స్వల్పంగా భూమి కంపించింది. రంగారెడ్డి, హనుమకొండ, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో స్వల్ప భూకంపం వచ్చింది. విజయవాడ నగరం, జగ్గయ్యపేట పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో భూప్రకంపంనలు వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఇళ్లు, అపార్టుమెంట్ల నుంచి ప్రజలు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. అయితే భూకంపం వల్ల జరిగిన నష్టంపై ఇప్పటికీ సమాచారం లేదు. ఇక జనగామలో  స్వల్పంగా భూకంపం సంభవించింది. ఉదయం 7.28 గంటలకు భూమి కంపించింది. దాదాపు 3 నుంచి 5 సెకండ్ల వరకు భూమి కంపిండంతో ఇండ్లలో వస్తువులు కింద పడిపోగా.. మూసి ఉన్న ఇండ్ల తలుపులు బయట నుంచి ఎవరో కొట్టినట్టుగా కదలికలు వచ్చాయి. భూకంపం ప్రభావం రిక్టర్ స్కేల్ పై 5.3 గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. - జనగామ, మన చౌరాస్తా



### గోడలు కూడా ఊగాయి



జనగామ బాలాజీ నగర్‌లో కూడా భూమి కంపించింది. మా ఇంటిలో  ఉన్న కుర్చీలు, మంచాలు ఊగాయి. ఇంటి గోడలు కూడా కదిలినట్లు అనిపించింది. మా ఇంట్లోనే ఇలా జరుగుతుందేమో అనుకున్నాం. భయంతో బయటకి పరుగులు తీశాం.

- గుండగోని సుభాష్
బాలాజీ నగర్, జనగామ

### సోఫా కదిలింది..



ఉదయం ఇంట్లో సోఫాలో కూర్చుని టీవీ చూస్తుండగా ఒకసారిగా సోఫా కదిలినట్లు అయింది. సోఫా ఎందుకు కదిలిందో అని ఆశ్చర్యానికి లోనయ్యాను. కొద్దిసేపటికి తేరుకొని భూమి కంపించిందని గ్రహించాను. గతంలో కూడా ఇలాంటి స్వల్ప భూకప్రకంపనలు బచ్చన్నపేటలో వచ్చాయి. కానీ ఇంత పెద్దగా ఎప్పుడు రాలేదు.

- భాస్కరుని పృథ్వీరాజ్, టీచర్, బచ్చన్నపేట

### భయపడ్డాం..



బచ్చన్నపేటలో ఈరోజు ఉదయం భూమి కంపించింది. మా ఇంటిలోని పెంట్ హౌస్ పైన ఉన్న కుర్చీలు ఒకేసారి కదిలాయి. అందరం భయభ్రాంతులకు గురై ఇంటి నుంచి బయటకు పరుగులు తీశాము. భూకంపాల గురించి విన్నాం. కానీ ప్రత్యక్షంగా  మొదటిసారి చూశాం.

- గొట్టే కనకయ్య, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, బచ్చన్నపేట



## వైకల్యం లోపం కాదు.. అదృష్టంగా భావించాలి

2

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



## కొనుగుళ్లు సక్రమంగా సాగాలి

2

- అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్



## అమరుడు శ్రీకాంతాచారికి ఘన నివాళి

4

General News



# దివ్యాంగులుగా పుట్టడం లోపం కాదు అదృష్టం

- ప్రజావాణిలో దివ్యాంగులకు ప్రత్యేక సమయం
- దివ్యాంగుల కోసం స్పెషల్ ఎంప్లాయ్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తాం
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా
- ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

**జనగామ, మన చౌరాస్తా :** దివ్యాంగులు తమ వైకల్యాన్ని లోపంగా అనుకోవద్దని, అది వారి అదృష్టంగా భావించాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓం సాయి గార్డెన్స్ లో మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ పోకల జమునతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరూ కలిసి మెలిసి ఉంటూ వైకల్యాన్ని పారద్రోలాలి అనే థీమ్ తో 2024 అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. దివ్యాంగులుగా పుట్టడం అనేది లోపం కాదు.. అదృష్టంగా భావించాలన్నారు. ప్రభుత్వం వైకల్యం అనే పదాన్ని దివ్యాంగులుగా మార్చిందని, దివ్యాంగులందరూ అన్ని రంగాల్లో ముందుకు వెళ్లాలని, పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎటువంటి పొరపాట్లు లేకుండా దివ్యాంగులైన ఉద్యోగులు ఎంతో ఉత్తమంగా పనిచేశారని గుర్తు చేశారు. వారి సామర్ధ్యాలను కలెక్టర్ అభినందించారు. అలాగే వచ్చే ఎన్నికల్లో కూడా వారి సేవలను వినియోగించుకోవాలన్నారు. పారాలింపిక్స్ లో తెలంగాణకి చెందిన దివ్యంగులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారన్నారు. ప్రతి మూడు నెలలకోసారి కమిటీ జిల్లా స్థాయి మనటరింగ్ సమావేశాలను నిర్వహిస్తామని, ప్రజావాణిలో మొదటి ప్రాధాన్యతగా 12:30 నుంచి ఒంటి గంట వరకు దివ్యాంగుల కోసం సమయం కేటాయిస్తామని తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నకిలీ పత్రాల జారీని తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ జమున మాట్లాడుతూ నిజమైన దివ్యాంగులకు న్యాయం జరగాలని, మహిళా శక్తి క్యాంటీన్లలో, డ్వాక్రా గ్రూపుల్లో అవకాశం కల్పించాలని కోరారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయం నుంచి ఓం సాయి గార్డెన్స్ వరకు చేపట్టిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ ర్యాలీని జిల్లా కలెక్టర్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డీఆర్డీఏ వసంత, అదనపు డీఆర్డీఏ చంద్రశేఖర్, జిల్లాస్థాయి దివ్యాంగుల కమిటీ సభ్యులు, దివ్యాంగుల సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.










## ఏసీబీ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**జనగామ, మన చౌరాస్తా :** అవినీతి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ అవినీతి నిరోధక శాఖకు సహకరించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా కోరారు. ఏసీబీ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తన ఛాంబర్ లో కరపత్రం, పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా మీ పని చేసేందుకు లంచం అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064 సంప్రదించాలన్నారు. కార్యక్రమం లో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఏసీబీ ఇన్స్పెక్టర్ సమ్మయ్య, ఏవో మన్సూర్ పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలి

### అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. మంగళవారం జిల్లాలోని చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల రిజిస్టర్లను పరిశీలించి ఎప్పటికప్పుడు కొనుగోలు వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, వాటిని సరైన విధంగా నిర్వహించాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు. అలాగే కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతం, టోకెన్లు, గన్నీ బ్యాగుల గురించి ఆరా తీశారు. అదే విధంగా టార్పాలిన్లు సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని, ధాన్యాన్ని కేంద్రంలో ఎక్కువ రోజుల వరకు నిల్వ చేయకుండా, తేమ శాతం రాగానే తూకం వేసి మిల్లులకు తరలించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, సజావుగా నిర్వహించాలని, ధాన్యం కొనుగోళ్లలో అవకతవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## సీజ్ చేసిన మట్టి వేలం పాట



**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల మండలం లో కడవెర్గు గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన మట్టిని వేలం వేయనున్నట్లు చేర్యాల తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. సుమారుగా 200 టిప్పర్ల సీజ్ చేసిన మట్టిని ఈ నెల 5 న ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు తెలిపారు.

Local News




# దోషులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**– సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి**

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా గ్రామీణ పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జిల్లా డ్వాక్రా గ్రూపు సమైఖ్యలో జరిగిన అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పార్టీ ఆఫీస్‌లో విలేకరులతో మాట్లాడారు. జనగామ మండలంలోని వెంకిర్యాల గ్రామంలో ఎకరం 15 లక్షల కూడా విలువ చేయని భూమిని, నాలుగు ఎకరాలను రూ.2 కోట్ల 35 లక్షలకు కొనుగోలు చేశారు. ఇందులో భూమి అమ్మిన రైతుతో పాటు రైతు బంధువుల పేరు మీద రియల్ ఎస్టేట్ వ్యాపారి పేరు మీద వ్యాపారి చూపించిన వ్యక్తుల పేరు మీద 21 మంది పేరున 19 లక్షల రూపాయల చెక్కుల నుండి మొదలుకొని వివిధ రకాలుగా నాలుగు లక్షల రూపాయల వరకు భూమికి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులకు గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు డీఆర్‌వో భువనగిరి శ్రీనివాస్, డీపీవో దాసరి సమ్మక్క చెక్కులు జారీ చేశారన్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ నెల రోజులుగా విచారణ చేపడుతూ కేవలం 30 లక్షల రూపాయల వరకే రికవరీ చేశారు. అలాగే పత్రికలలో వార్తా కథనాలు వచ్చిన తర్వాత కంటి తుడుపు చర్యగా ఒకరిద్దరు అధికారులను సస్పెన్స్ వేటు వేశారు తప్ప పురోగతి లేదని అన్నారు. మహిళలు పైసా పైసా కూడబెట్టి కష్టం చేసుకున్న పైసలు అలాగే ఐకేపీలో వడ్ల కొనుగోలు కేంద్రంలో వచ్చిన కమిషన్ డబ్బులను కలెక్టర్ నియంత్రణ లేకుండా డ్రా చేసిశరంటే గ్రామీణ అభివృద్ధి శాఖపై అలాగే వివిధ శాఖలపై కలెక్టర్‌కు పట్టులేదని అర్థమవుతుందన్నారు. తక్షణం దీనిపై సమగ్రమైన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, రాపర్తి సోమయ్య, రాపర్తి రాజు, ఇర్రి అహల్య, సింగారపు రమేష్, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు సభ్యులు బూడిది గోపి, జోగు ప్రకాష్, సుంచు విజయేందర్, బోడా నరేందర్, ఎండి హజార్, పి.ఉపేందర్, బెల్లంకొండ వెంకటేష్, చందు నాయక్, మునిగేల రమేష్, ఎండి షబానా, చిట్యాల సోమన్న, యాకయ్య, పొదల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# బోథ్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక

**బోథ్, మన చౌరాస్తా :** బోథ్ మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలోని ప్రైవేట్ కళాశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా సూది నరేష్ (V6 వెలుగు), ప్రధాన కార్యదర్శిగా గొడిసెల రమణ గౌడ్ (ముద్ర), కోశాధికారిగా లింగంపల్లి సంతోష్ (ప్రజా పక్షం) ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మల్లెపూల గంగయ్య (ఆంధ్రజ్యోతి), ఇర్ల ఎర్రన్న (మన తెలంగాణ), జగదీశ్వర్ రెడ్డి (నమస్తే తెలంగాణ), రాథోడ్ దేవిదాస్ (నవ తెలంగాణ), మల్లేష్ (ఆంధ్ర ప్రభ) బొనగిరి కార్తీక్ (సాక్షి) , నమలికొండ సంతోష్ కుమార్ శర్మ (మన చౌరాస్తా), పురుషోత్తం (వార్త), నంది కేశ్వర్ (ఈనాడు), సాయిని గంగాధర్ (ప్రభాత సమాచారం), టి,రమేష్ (తెలంగాణ వాణి) కె. ప్రవీణ్ (అరణ్య), తూము సూర్యం (దిశ), మునిగెల శ్రీధర్ (ప్రజా శంఖారావం), షేక్ అలీ (ప్రజా జ్యోతి), కుమ్మరి వంశీ (జనం సాక్షి) రాజేష్ (సూర్య), మోహన్ (జర్నలిస్ట్ వార్త), మంచికుంట సతీష్ (హన్స్ ఇండియా), వర ప్రసాద్ (సాక్షర) ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీకి కార్యవర్గ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం తో పాటు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని అన్నారు.

## నూతన కార్యవర్గానికి సన్మానం

మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైన నేపథ్యంలో వారికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులు సూది నరేష్, కోశాధికారి లింగంపల్లి సంతోష్, మాజీ అధ్యక్షులు బోనగిరి కార్తీక్, కార్యవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు శ్రీధర్ రెడ్డి, సురేందర్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, మండల్ ప్రధాన కార్యదర్శి ఎల్కరాజు, బోడ్డు శ్రీనివాస్, డాక్టర్ స్వామి, కుమ్మరి రమణ, సురేష్, బాబుసింగ్, రబ్బండ్, రవి, రాము, బోడ లక్ష్మన్, రమణగౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అగాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ప్రెస్ క్లబ్ కమిటీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసుల చంటితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# విద్యుత్ సబ్ స్టేషన్ సందర్శన

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని 132/33 కేసీ సబ్ స్టేషన్ ను ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మంగళవారం సందర్శించారు. సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరా జరుగుతున్న విద్యుత్తు పై ఆరా తీశారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యశస్విని రెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్టేషన్ ఘన్ పూర్ డివిజన్ డీఈ రాంబాబు, పాలకుర్తి ఏఈ రణదీర్ రావు , కాంగ్రెస బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ , మండల అధ్యక్షుడు కుమారస్వామి పాల్గొన్నారు.



# ఘనంగా వికలాంగుల దినోత్సవం

పాలకుర్తి , మన చౌరాస్తా : పాలకుర్తి మండల విద్యా వనరుల కేంద్రంలో విద్యాశాఖ అధికారి పోతుగంటి నర్సయ్య ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థుల ఆట పాటలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు అధికారులు బహుమతులు అందజేశారు. పిల్లలకు ప్రత్యేక బోధనతో పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిని అన్ని రంగాలలో అభివృద్ధి పరచాలని నరసయ్య కోరారు. ప్రతి ఒక్కరూ వైకల్యాన్ని అధిగమించి మానసిక ఉల్లాసంతో అన్ని రంగాలలతో పాటు జీవితంలో అభివృద్ధి చెందాలని కోరారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో చెన్నూరు పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు రమేష్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల బమ్మెర ప్రధానోపాధ్యాయులు ముచింతల రామ్మోహన్ రావు, ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు విజయేందర్, రాజశేఖర తదితరులు పాల్గొన్నారు.



# పత్తి పంటను ధ్వంసం చేసిన అడవి పందులు

**బోథ్, మన చౌరాస్తా :** బోథ్ మండలంలోని కోటా (కే) గ్రామానికి చెందిన కాశీనాథ్ గాడ్వె సర్వే నెంబర్ 17, మాధవ్ కేంద్రే సర్వే నెంబర్ 16 భూమిలో పత్తి పంటను అడవి పందులు ధ్వంసం చేశాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, తమకు జరిగిన నష్టాన్ని అధికారులు గుర్తించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. అప్పులు చేసి పంటను సాగు చేశామని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

General News



# తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి ఘన నివాళి

**జనగామ, మన చౌరాస్తా :**

తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి 15వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తల్లి కాసోజు శంకరమ్మ స్వగ్రామం పొడిచేడులో ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో జనగామ జిల్లా విశ్వకర్మ సంఘం తరపున జిల్లా అధ్యక్షుడు దీగోజు నరసింహ చారి, సంఘ పెద్దలు దీగోజు సాంబయ్యచారి, బాత్తోజు సిద్ధిరాములు చారి, చెల్లోజు నవీన్ చారి, మడుపోజు రాములు చారి, మాయోజు కృష్ణమూర్తి చారి, మద్దోజు గంగాభవానీ, మహంకాళి పద్మ పాల్గొని శ్రీకాంతాచారికి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### బాన్సువాడలో..

**జుక్కల్ :** బాన్సువాడ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ అద్వర్యంలో కాసోజు శ్రీకాంతాచారి వర్ధంతిని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబెర్ మాట్లాడుతూ.. శ్రీకాంతాచారి చేసిన త్యాగాన్ని వెలకట్టలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో మోచి గణేష్, చాకలి మహేష్, రమేష్ యాదవ్, శివసూరి, గౌస్, నల్లోల సాయిలు, బోర్లం అనిల్ , ఆటో మౌలా, జావీద్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



### కామారెడ్డిలో...

కామారెడ్డి : 1986 ఆగష్టు 15 న జన్మించిన శ్రీకాంత్ చారి తెలంగాణ మలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించాడు. విద్యార్థి సంఘ నాయకుడిగా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న శ్రీకాంత్ చారి ఆ నాటి అక్రమ అరెస్టులు, లాఠి చార్జీలు చూసి తట్టుకోలేక పోయాడు. శ్రీకాంత్ చారీ వర్ధంతి సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు నివాళులు అర్పించారు. ఆయన ఉద్యమం ప్రతి యొక్క విద్యార్థి సంఘ నాయకుడికి ఎంతో స్పూర్తినిచ్చింది అన్నారు.



# మలిదశ ఉద్యమకారులకు రూ. 25 వేల పెన్షన్ ఇవ్వాలి

**తుంగతుర్తి, మన చౌరాస్తా : మోత్కూరులో తెలంగాణ మలిదశ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారికి నెలకు రూ. 25 వేలు పెన్షన్ ఇవ్వాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాసోజు శ్రీకాంతాచారి 15వ వర్ధంతి సందర్భంగా మోత్కూరు పట్టణంలోని శ్రీకాంత్ చౌరస్తా వద్ద బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.**

# గురుకులాలపై బీఆర్ఎస్ దుష్ప్రచారం మానుకోవాలి

**ములుగు, మన చౌరాస్తా:** గురుకులాలపై బీఆర్ఎస్ నాయకులు చేసే దుష్ప్రచారాన్ని మానుకోవాలని ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. ఈ మేరకు ఆయన ములుగు మండలంలోని జాకారం గురుకులాన్ని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు 50 మంది ఒకేసారి గురుకులంలోకి వెళ్లి విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# కేజీబీవీని సందర్శించిన టీఆర్ఎస్వీ నేతలు

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కేటీఆర్ ఆదేశానుసారం తెలంగాణ వ్యాప్తంగా గురుకుల బాటలో భాగంగా కొమరవెల్లి మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని టీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘ నాయకులు సందర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు దుప్పట్లు, దుస్తులు, ఫుడ్, మెడికల్ సమస్యలు ఉన్నాయని, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 42 మంది చనిపోయారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గురుకులాలపై దృష్టి కేంద్రీకరించాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు ఏర్పుల మహేష్, కొమరవెల్లి మాజీ జెడ్పిటిసి సిలువేరు సిద్ధప్ప, బీఆర్ఎస్ నాయకులు తలారి కిషోర్, సాగర్, విరాట్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# అడవుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల మండలంలోని నాగపురి ఉన్నత పాఠశాలలో మంగళవారం వన్యప్రాణుల సంరక్షణ, అగ్ని ప్రమాదాల నుంచి అడవుల రక్షణపై ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వై. రాముడు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడడం జంతువులను సంరక్షించడం, అడవుల్లో జరిగే అగ్ని ప్రమాదాల రకాలు, వాటి నివారణ మార్గాలను విద్యార్థులకు సవివరంగా వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎలికట్టే అయిలయ్య ఉపాధ్యాయులు టి.పద్మ, ఎస్.నిరుపమ. ఏ.విజయ్ కుమార్, టి.మనోజ్ కుమార్, జి.ప్రకాష్ రెడ్డి, కే.మాధవి, సిహెచ్ యాదగిరి, స్వర్ణకుమార్, పి.రాజేశ్వరి, ఎస్.కనకలింగం, జి.శ్రీధర్, ఫహీం సుల్తానా, ఎండీ ఉమర్, ఎస్.స్వామి పాల్గొన్నారు.

# ప్రజా పాలన వియోత్సవాల్లో హెల్త్ క్యాంప్ నిర్వహణ

**హుజూర్‌నగర్, మన చౌరాస్తా :** యాదాద్రి జిల్లా మోత్కూరులో ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోత్కూరు పురపాలక సంఘం కార్యాలయంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. క్యాంపులో మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం కవిత, మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్ ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షల నిమిత్తం హెల్త్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు.

Health special


# శరీరంలో ఈ 5 లక్షణాలు కనిపిస్తున్నాయా..?



అధిక కొలెస్ట్రాల్ ఒక తీవ్రమైన వ్యాధి.. దాని లక్షణాలు మొదట కనిపించవు. కానీ కాలక్రమేణా దాని లక్షణాలు శరీరంలో కనిపిస్తాయి. నిర్లక్ష్యం చేస్తే మీ ఆరోగ్యానికి హాని కలుగుతుంది. చెడు కొలెస్ట్రాల్ ఊబకాయంతోపాటు ప్రమాదకరమైన జబ్బుల బారిన పడేలా చేస్తుంది.. అయితే.. చెడు కొలెస్ట్రాల్ సిరల్లో పేరుకుపోతే, మీకు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని అస్సలు నిర్లక్ష్యం చేయకండి కొలెస్ట్రాల్ ప్రాణాంతకంగా మారుతుంది.. దీని లక్షణాలను నిర్లక్ష్యం చేయడం వల్ల గుండెపోటు వస్తుంది. పక్షవాతం వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది.. అంతేకాకుండా ఊబకాయంతోపాటు ఆరోగ్యాన్ని దెబ్బతీసి ప్రమాదకర జబ్బుల బారిన పడేలా చేస్తోంది.. అయితే.. కొలెస్ట్రాల్ అనేది కణ త్వచాలలో కనిపించే కొవ్వు, జిడ్డుగల స్టెరాయిడ్.. ఇది రక్త సిరల్లో ఫలకం పేరుకుపోవడానికి కారణమవ్వడంతోపాటు రక్తం సరఫరాకు అడ్డంకిని కలిగిస్తుంది. కొలెస్ట్రాల్ ను రెండు రకాలుగా విభజిస్తారు.. అధిక సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ అంటే మంచి కొలెస్ట్రాల్ అని.. తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ అంటే చెడు కొలెస్ట్రాల్ గా పరిగణిస్తారు. చెడు కొలెస్ట్రాల్ సిరల్లో పేరుకుపోతే.. మీకు శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని అస్సలు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.. ఈ క్రింది ఐదు లక్షణాలను గమనించినట్లయితే వెంటనే వైద్యుడిని సంప్రదించండి. చెడు కొలెస్ట్రాల్ శరీరంలో పేరుకుపోవడం ప్రారంభించినప్పుడు, సగం లేదా మొత్తం తల నొప్పి ప్రారంభమవుతుంది. ఇది తీవ్రంగా ఉంటు8ంది.. అధిక కొలెస్ట్రాల్ ఉన్న రోగులు ఈ లక్షణాలను ఎప్పటికీ విస్మరించకూడదు.. ఎందుకంటే ఈ లక్షణాల కారణంగా తరువాత స్ట్రోక్ భయం ఉంటుంది. అధిక కొలెస్ట్రాల్ ఉన్న రోగులలో కొన్ని నిర్దిష్ట ఛాతీ లక్షణాలు కనిపిస్తాయి. మీరు దీన్ని అనుకోకుండా విస్మరిస్తే మీకు చాలా ప్రాణాంతకంగా మారుతుంది. మీరు ఛాతీ నొప్పి లేదా ఒత్తిడి వంటి ఏవైనా లక్షణాలను అనుభవిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించండి. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోవడం ప్రారంభించినప్పుడు, మీ కళ్ళ క్రింద తెల్లటి మచ్చలు కనిపిస్తాయి. ఈ సందర్భంలో, మీరు వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించాలి. శరీరంలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటే, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది.. ఊపిరి ఆడకపోవడం లేదా శ్వాస తీసుకోవడంలో ఇతర రకాల ఇబ్బందులు అధిక కొలెస్ట్రాల్ లక్షణం కావచ్చు. ఇది కాకుండా, ఇది అనేక ఇతర తీవ్రమైన వ్యాధుల లక్షణంగా కూడా ఉంటుంది. అకస్మాత్తుగా అలసట లేదా బలహీనంగా అనిపించడం, మైకము, కాళ్లు గుంజడం, నొప్పి, గోర్లు పసుపు రంగులోకి మారడం, పాదాలు చల్లగా ఉండటం కూడా అధిక కొలెస్ట్రాల్ కు సంకేతం.. అంతేకాకుండా తీవ్రమైన అనారోగ్యానికి సంకేతం కూడా కావొచ్చు.. శరీరంలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించండి.

## పొట్ట గుట్టలా మారిందా.?

ఊబకాయంతో బాధపడుతున్నారా.? మీ పొట్ట గుట్టలా మారిందా.? జర టెన్షన్ పడకండి.. ఈ అలవాట్లు ఉదయం అల్పాహారం వేళ పాటిస్తే.. మీ పొట్ట కూడా కరిగిపోవాల్సిందే.. ఆ టిప్స్ ఏంటి అంటే.? రోజంతా యాక్టివ్‌గా ఉండాలంటే అల్పాహారం అత్యంత ముఖ్యమైనది. అందువల్ల ప్రోటీన్లు అధికంగా ఉండే అల్పాహారంతో రోజును మొదలుపెట్టాలని వైద్యులు అంటుంటారు. ప్రోటీన్లు మనలో ఆకలిని కంట్రోల్ చేస్తుంది. అల్పాహారంలో గుడ్లు, పెరుగు, చీజ్, పప్పు దినుసులు ఉండాలి. వీటిని తింటే అతిగా తినే అలవాటు తగ్గుతుందని డాక్టర్లు చెబుతున్నారు. ఉదయాన్నే శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడం వల్ల జీవక్రియ సక్రమంగా ఉంటుందట. రోజంతా క్రమం తప్పకుండా నీరు తాగడం వల్ల బరువు తగ్గడం, శక్తి పెరగడం జరుగుతుంది. రోజూ 34 నుంచి 68 ఔన్సుల నీరు తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. వెచ్చని నీటితో రోజు ప్రారంభించడం ఆరోగ్యానికి చాలా మంచిదని సిఫార్సు చేస్తున్నారు. శరీరానికి అవసరమైన విటమిన్లలో విటమిన్ డి ఒకటి. ఇది సూర్యకాంతి నుంచి వస్తుంది. కాబట్టి ఉదయాన్నే శరీరానికి సూర్యరశ్మి తగలాలి. విటమిన్ డి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. విటమిన్ డి శరీరంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. రోజూ 10 నుంచి 15 నిమిషాలు సూర్యరశ్మిలో ఉండటం వల్ల బరువు తగ్గవచ్చు. రోజువారీ వ్యాయామం చాలా ముఖ్యం. వ్యాయామం చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చు. ఉదయం వ్యాయామం చేయడం వల్ల శక్తి కూడా పెంపొందుతుంది. ఊబకాయం రాకుండా ఉండాలంటే ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని తినాలి. ఇంట్లో వండిన ఆహారం ఏది తిన్నా బరువు అదుపులో ఉంటుంది. అందువల్ల బరువు పెరిగే అవకాశం తక్కువ.





తరుముకొస్తున్న మరో

## ప్రాణాంతక వైరస్!



మరో పెను ప్రమాదం వైరస్ రూపంలో తరుముకొస్తుంది. ఇప్పటికే ఆఫ్రికాలో దీని బారీన పడి 15 మంది మరణించారు. ఈ వైరస్ కి చికిత్స కూడా అందుబాటులో లేదు. ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందుతున్న ఈ వైరస్ ను అడ్డుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఔనూ ప్రపంచ దేశాలకు హెచ్చరికలు జారీ చేసింది. నిన్న మొన్నటి వరకు కరోనా వైరస్ సృష్టించిన మారణహోమాన్ని ఇంకా పూర్తిగా మర్చిపోకముందే మరో ప్రాణాంతక వైరస్ దాడికి సిద్ధమైంది. అదే బ్లీడిరడ్ ఐ వైరస్. ఇప్పటికే 'బ్లీడిరగ్ ఐ' వైరస్ రువాండాలో 15 మందిని పొట్టన పెట్టుకుంది. వందలాది మందికి వేగంగా సోకింది. ఇది వెలుగులోకి వచ్చినప్పటి నుంచి గత రెండు నెలల్లో ఏకంగా 17 ఆఫ్రికన్ దేశాలకు వ్యాపించింది. రువాండా, బురుండి, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, కాంగో, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, గాబన్, కెన్యా, ఉగాండా, బొలీవియా, బ్రెజిల్, కొలంబియా, క్యూబా, డొమినికన్ రిపబ్లిక్, ఈక్వెడార్, గయానా, పనామా, పెరూ దేశాలకు ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికాలు జారీ చేసింది. అంతేకాకండుడా ఈ ప్రాంతాలకు వెళ్లే వారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. బ్లీడిరగ్ ఐ వైరస్ అంటే ఏమిటి?.. గతంలో దీనిని మార్బర్గ్ హెమరేజిక్ జ్వరం అని పిలిచేవారు. ఇది ప్రాణాంతక అంటువ్యాధి. ప్టెరోపోడిడే కుటుంబానికి చెందిన రౌసెట్టస్ ఈజిప్టియాకస్ అనే పండ్ల గబ్బిలం నుంచి ఈ వైరస్ వ్యాపిస్తుంది. ఇన్‌ఫెక్షన్ వ్యాపించిన రెండు నుంచి 21 రోజులలోపు ఈ వైరస్ లక్షణాలు బయటపడతాయి. అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, అనారోగ్యంతోపాటు కండరాల నొప్పులు దీని ప్రధాన లక్షణాలు. ఈ వైరస్ సోకిన మూడవ రోజు నుండి విరేచనాలు, కడుపునొప్పి, తిమ్మిర్లు, వికారం, వాంతులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. 5 వ రోజు నుండి వాంతులు, మలంలో రక్తం, ముక్కు, కళ్ళు, చెవులు, నోరు, చిగుళ్ళు నుండి రక్తస్రావం అవుతుంది. రోగలక్షణం ప్రారంభమైన ఎనిమిది నుండి తొమ్మిది రోజుల వ్యవధిలో మరణం సంభవిస్తుంది. బ్లీడిరగ్ ఐ వైరస్ సోకిన వ్యక్తుల రక్తం, స్రావాలు, అవయవాలు, ఇతర శారీరక ద్రవాల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుంది. బ్లీడిరగ్ ఐ సోకిన రోగులకు వైద్యం అందిస్తున్న డాక్టర్లు కూడా దీని బారీన పడుతున్నారు. రోగిని ప్రత్యక్షంగా తాకినా ప్రాణాపాయమే. బ్లీడిరగ్ వైరస్‌కు ఇప్పటి వరకు ఎలాంటి చికిత్స అందుబాటులో లేదు. టీకాలు లేదా యాంటీవైరల్ చికిత్సలు కూడా లేవు. అయితే రీహైడ్రేషన్‌తో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, రోగలక్షణాలను బట్టి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

# Varsha
## Digitals

మీ పుట్టిన రోజు, పెళ్లిరోజుల శుభాకాంక్షలు..
నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డ్స్ మరియు క్యాలెండర్లను ఆకర్శనీయంగా డిజైనింగ్ చేయబడును..
వివరాలకు ఈ కింది నంబర్లను సంప్రదించండి.

**8555 800 812**
**9676 400 812**

